## వివాహ వేడుకల్లో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట టౌన్, ఏప్రిల్ 23: సూర్యాపేట నియోజకవర్గంతో పాటు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా బుధవారం జరిగిన పలు వివాహ వేడుకలకు మాజీ మంత్రి, సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి హాజరయ్యారు. ఆత్మకూర్.ఎస్ మండలం నెమ్మికల్‌లోని శుభం ఫంక్షన్ హాల్‌లో జరిగిన గిలకత్తుల అంజయ్య కుమారుడి వివాహ వేడుకతో పాటు ఎస్వీ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన పిట్టల మహేందర్, నాగమణిల కుమార్తె వివాహ వేడుకలో పాల్గొన్నారు. అదేవిధంగా ఎంజీ నగర్ తండాలోని ఎస్ఎల్ఎన్ఎస్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన పెద్దబోయిన వీరస్వామి, అంజమ్మ కుమారుడి వివాహ వేడుకలో, నాగారం మండలం ఫణిగిరిలోని ఆనంద గార్డెన్స్‌లో జరిగిన చిప్పలపల్లి మంగమ్మ, రాములు కుమారుడి వివాహ వేడుకలో, నల్లగొండ జిల్లా కేతేపల్లి మండల కేంద్రంలోని జ్యోతి ఫంక్షన్‌హాల్‌లో జరిగిన దాసరి నర్సింహ, చంద్రకళ కుమార్తె వివాహ వేడుకలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.

## 'బీఆర్ఎస్ రజతోత్సవ సభను జయప్రదం చేయాలి'



ఎర్కారంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు

సూర్యాపేట రూరల్, ఏప్రిల్ 23: ఈ నెల 27న ఎల్కతుర్తిలో నిర్వహించే బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభలో కార్యకర్తలు, నాయకులు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వంగాల శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ జీడి భిక్షం పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం మండల పరిధిలోని ఎర్కారం, సఫవత్‌తండా, పిన్నాయిపాలెం, రాజానాయక్‌తండా, లక్ష్మీతండా, దాస్‌తండా, కేటీ అన్నారం గ్రామాల్లో నిర్వహించిన సన్నాహక సమావేశాల్లో వారు పాల్గొని మాట్లాడారు. సభకు గ్రామాల నుంచి వందలాదిగా తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు కాటసాని వెంకట్‌రెడ్డి, చింతలపాటి మధు, నక్క జాని, నూనావత్ మోతీలాల్, బొడ్డు కిరణ్, బొర్ర దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ చౌటపల్లి గ్రామశాఖ ఎన్నిక



గ్రామశాఖ ఎన్నికలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

మఠంపల్లి, ఏప్రిల్ 23: మండల పరిధిలోని చౌటపల్లి గ్రామ బీఆర్ఎస్ నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. గ్రామశాఖ అధ్యక్షుడిగా వీరంరెడ్డి వీరారెడ్డి, ఉపాధ్యక్షుడిగా షేక్ నాగుల్‌మీరా, ప్రధాన కార్యదర్శిగా గుండెపంగు నరసింహారావు తదితరులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు మద్ది హుస్సేన్‌రెడ్డి, కంచాల శ్రీనివాస్‌రెడ్డి, గుండెపంగు కృష్ణవేణి నరేశ్, మాజీ సర్పంచులు ఇరిగెల వెంకటరెడ్డి, ఐతగాని వీరబాబుగౌడ్, పేరం కొండలు, గోపాల్‌రెడ్డి, కొండలు, నర్సయ్య, గుండెపంగు శ్రీను, సుధాకర్, కందుల కిరణ్ పాల్గొన్నారు.

## రజతోత్సవ సభ పోస్టర్ ఆవిష్కరణ



నూతనకల్‌లో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

నూతనకల్, ఏప్రిల్ 23: మండల కేంద్రం నూతనకల్‌లో బీఆర్ఎస్ నాయకులు బుధవారం బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మున్న మల్లయ్య మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు గ్రామాల నుంచి భారీగా తరలివచ్చి సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల కార్యదర్శి బత్తుల సాయిల్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ గాడ్డుల లింగరాజు, నాయకులు బత్తుల విద్యాసాగర్, మందడి సోమిరెడ్డి, మొగుళ్ల వెంకన్న, మూరగుండ్ల సైదులు, బత్తుల విజయ్, ఉప్పుల వీరు యాదవ్, గడ్డం యాదగిరి, మహేశ్వరం మల్లికార్జున్, వీరమల్ల యాదగిరి, సంగినేని సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ ట్యాంకర్ పక్కదారిపై విచారణకు ఆదేశం

పాలకవీడు, ఏప్రిల్ 23: మండలంలోని జాన్‌పహాడ్ గ్రామంలో పంచాయతీ ట్రాక్టర్‌ను ఓ వ్యక్తి భవన నిర్మాణం కోసం వాడుతుండడంపై 'పంచాయతీ ట్యాంకర్ పక్కదారి' శీర్షికన నమస్తే తెలంగాణ దినపత్రికలో ఈ నెల 23న ప్రచురితమైన కథనానికి డీపీఓ స్పందించి విచారణకు ఆదేశించారు. తక్షణమే విచారణ జరిపి సమగ్ర నివేదికను అందజేయాలని ఎంపీఓ వీరయ్యను ఆదేశించారు. దీనిపై ఎంపీఓ వివరణ కోరగా జాన్‌పహాడ్ గ్రామంలో వాటర్ ట్యాంకర్ దుర్వినియోగంపై విచారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదికను అందజేస్తామని చెప్పారు. దీనికి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకుంటామని వివరించారు.

## ఉగ్రదాడిలో మరణించిన టూరిస్టులకు నివాళి



నేరేడుచర్లలో నివాళులర్పిస్తున్న మాతరం యూత్ సభ్యులు

నేరేడుచర్ల, ఏప్రిల్ 23: జమ్ము కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదులు జరిపిన దాడిలో మరణించిన టూరిస్టులకు బుధవారం నేరేడుచర్లలో మాతరం యూత్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ముష్కరుల దాడిని నిరసిస్తూ నల్లబ్యాడ్జీలు ధరించి కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో కొణతం సత్యనారాయణరెడ్డి, ఆకారపు వెంకటేశ్వర్లు, యారవ సురేశ్, రాపోలు నవీన్‌కుమార్, జింకల భాస్కర్, సరికొప్పుల నాగేశ్వరరావు, కళీం, యూసుఫ్, పల్లెపంగ నాగరాజు, తాళ్ల నరేందర్ రెడ్డి, కొణతం నాగిరెడ్డి, సంకలమద్ది సత్యనారాయణరెడ్డి, ధూళిపాళ ధనుంజయనాయుడు, కొణతం సీతారాంరెడ్డి, పోకబత్తిన శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

**మఠంపల్లిలో..**

మఠంపల్లి: ఉగ్రదాడిని ఖండిస్తూ మఠంపల్లిలో హిందూ సంఘాల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వెంకటశివ, బొగ్గవరపు రాధాకృష్ణ, శ్రీమన్నారాయణ, గుర్రం మట్టారెడ్డి, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ నూతన కమిటీ ఎన్నిక

సూర్యాపేట టౌన్, ఏప్రిల్ 23: లయన్స్ క్లబ్ ఆఫ్ సూర్యాపేట నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు నూతన అధ్యక్షుడు మిర్యాల సుధాకర్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని లయన్స్ సర్వీస్ సెంటర్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రధాన కార్యదర్శిగా గుండా లక్ష్మయ్య, కోశాధికారిగా పాశం అనంతరావు, ఉపాధ్యక్షులుగా ఈగా దయాకర్‌గుప్తా, ఎర్రంశెట్టి ఉపేందర్, జాయింట్ సెక్రటరీగా చీకూరి కృష్ణగౌడ్, మెంబర్‌షిప్ చైర్మన్‌గా మల్గిరెడ్డి కృష్ణారెడ్డి, సర్వీస్ చైర్మన్‌గా కుమ్మరికుంట్ల లింగయ్య, మార్కెటింగ్ చైర్మన్‌గా శివరాత్రి రవి, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్‌గా వాంకుడోతు వెంకన్న, స్కూల్ ఎడ్యుకేషన్ కో-ఆర్డినేటర్‌గా పుట్టా వెంకన్న, డయాబెటిక్ క్యాంపు చైర్మన్‌గా ముద్ద భిక్షపతియాదవ్, ఫండ్ రైజింగ్ చైర్మన్‌గా అండెం వెంకన్న, ఐ డొనేషన్ చైర్మన్‌గా వెంపటి శబరినాథ్, సోషల్ మీడియా చైర్మన్‌గా మీలా వంశీని ఎన్నుకున్నట్లు తెలిపారు. ఎన్నికల అధికారులుగా పటేల్ నరసింహారెడ్డి, పెండెం చంద్రశేఖర్, ఉప్పల రాజేంద్రప్రసాద్ వ్యవహరించినట్లు వివరించారు.

# నామమాత్రంగా ధాన్యం కొనుగోళ్లు



తిరుమలగిరిలోని కొనుగోలు కేంద్రంలో ధాన్యం రాశులు

తిరుమలగిరి, ఏప్రిల్ 23: తిరుమలగిరి మండలంలో ధాన్యం కొనుగోళ్లు నామమాత్రంగా సాగుతున్నాయి. కొనుగోలు కేంద్రాల్లో పోసిన ధాన్యం గత 20 రోజుల నుంచి కాంటాలు కాక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో 15 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. కేవలం ఆరు కేంద్రాల్లోనే ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్నాయి. మిగతా చోటు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. త్వరితగతిన అధికారులు ధాన్యం కాంటాలు చేసి ఇబ్బందులు లేకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

## జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా లక్ష్మీశారద బాధ్యతలు



బాధ్యతలు స్వీకరించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీశారద

సూర్యాపేట లీగల్, ఏప్రిల్ 23: జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా పి.లక్ష్మీశారద బుధవారం బాధ్యతలు స్వీకరించారు. మెదక్ జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసిన ఆమె బదిలీపై సూర్యాపేట జిల్లాకు వచ్చారు. 1994లో న్యాయవాదిగా ప్రస్థానం ప్రారంభించిన ఆమె 1998లో జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. 2010లో సీనియర్ సివిల్ జడ్జిగా, 2018లో అదనపు జిల్లా జడ్జిగా, 2022లో మెదక్ జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు.

## నేడు 'యువ వికాసం' దరఖాస్తుదారుల సర్టిఫికెట్ల పరిశీలన

నేరేడుచర్ల, ఏప్రిల్ 23: రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తుదారుల సర్టిఫికెట్లను మండలంలోని ఆయా గ్రామ పంచాయతీల్లో గురువారం పరిశీలించనున్నట్లు ఎంపీడీఓ సోమసుందర్‌రెడ్డి బుధవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. దరఖాస్తుదారులు ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో కార్యదర్శులకు అందుబాటులో ఉండి సహకరించాలని కోరారు.

## ఇసుక లారీ సీజ్

కోదాడ రూరల్, ఏప్రిల్ 23: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీని కోదాడ రూరల్ పోలీసులు బుధవారం పట్టుకొని సీజ్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా నందిగామ సమీపంలోని అంతర్‌గంగా వాగు నుంచి కోదాడకు అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీని రూరల్ పోలీసులు రామాపురం క్రాస్‌రోడ్డు వద్ద పట్టుకున్నారు. డ్రైవర్, ఓనర్ అన్వర్‌పాషాపై కేసు నమోదు చేసి లారీని సీజ్ చేసినట్లు ఎస్ఐ ఎం.అనిల్‌రెడ్డి తెలిపారు.

## ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

● సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు

చిలుకూరు, ఏప్రిల్ 23: ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల పరిధిలోని సీతారాంపురం గ్రామంలోబుధవారం నిర్వహించిన సీపీఐ గ్రామస్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో సరైన వసతులు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కాంటా అయిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు లారీల్లో మిల్లులకు తరలించాలని పేర్కొన్నారు. గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచాలని కోరారు. అనంతరం సీపీఐ గ్రామశాఖను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా కనకం రుద్రయ్య, సహాయ కార్యదర్శిగా పుట్టపాక రవి, 9 మందిని కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి మండవ వెంకటేశ్వర్లు, నాయకులు బాలెబోయిన గురవయ్య, అలివేలు, పిల్లుట్ల చంద్రయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## వడదెబ్బతో వ్యక్తి మృతి

చిలుకూరు, ఏప్రిల్ 23: వడదెబ్బతో వ్యక్తి మృతిచెందిన ఘటన మండల కేంద్రం చిలుకూరులో చోటుచేసుకుంది. మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. చిలుకూరుకు చెందిన కొడారు కోటయ్య(62) రోజు మాదిరిగానే మంగళవారం ఉపాధి హామీ పనులకు వెళ్లాడు. ఇంటికి వచ్చిన తర్వాత నీరసంగా ఉందని కుటుంబ సభ్యులకు చెప్పాడు. ఈ క్రమంలోనే అస్వస్థతకు గురైన ఆయనను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా రాత్రి మృతిచెందాడు. కాగా, వడదెబ్బతోనే కోటయ్య మృతిచెందాడని బంధువులు తెలిపారు.

## 'దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి'



అభివాదం చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

సూర్యాపేట టౌన్, ఏప్రిల్ 23: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్తంగా మే 20న చేపట్టనున్న సార్వత్రిక సమ్మెను కార్మికవర్గం విజయవంతం చేయాలని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్న, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల శ్రీనివాస్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు, ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంట నాగయ్య, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు దంతాల రాంబాబు, టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు హుస్సేన్ పిలుపునిచ్చారు. స్థానిక ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్మిక సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. మోదీ సర్కార్ కార్పొరేట్ శక్తులకు ప్రయోజనం చేకూర్చే విధానాలను రూపొందిస్తుందని ఆరోపించారు. కార్మిక హక్కులను కాలరాస్తూ, కనీస వేతనాలు అమలు చేయకుండా, జీవన ప్రమాణాలు మెరుగు పర్చకుండా ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. కార్మికవర్గం పోరాడి సాధించుకున్న 49 లేబర్ చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా కుదించి కార్మికులను బడా పెట్టుబడిదారులకు తాకట్టు పెట్టే కుట్రలకు కేంద్రం ఒడిగట్టిందని విమర్శించారు. సార్వత్రిక సమ్మె విజయవంతం కోసం మే 6న సూర్యాపేట జిల్లా కేంద్రంలో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జిల్లా సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో కార్మిక సంఘాల నాయకులు కాసర్ల శ్రీను, వల్దాస్ శ్రీను, దేశోజు మధు, ఖమ్మంపాటి రాము, పాపన్న తదితరులు పాల్గొన్నారు.

## 'మేడే వేడుకలను విజయవంతం చేయాలి'



కార్యక్రమంలో మాట్లాడుతున్న కోటేశ్వరరావు

గరిడేపల్లి, ఏప్రిల్ 23: మేడే వేడుకలను కార్మికులు వాడవాడలా నిర్వహించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం (సీఐటీయూ అనుబంధం) మండల అధ్యక్షుడు జంజనం కోటేశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలో బుధవారం జరిగిన ఆ సంఘం కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మే 1న జరిగే అంతర్జాతీయ కార్మిక దినోత్సవంలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో కార్మికులు కనకయ్య, నాగరాజు, పుల్లయ్య, సైదులు, వీరేందర్, మహేశ్, కృష్ణ, ఖాదర్, నారాయణ, సూరిబాబు, జాను, భిక్షం, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

## 'ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి'

నేరేడుచర్ల, ఏప్రిల్ 23: ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని బీజేపీ నేరేడుచర్ల పట్టణాధ్యక్షుడు కొణతం నాగిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నేరేడుచర్ల పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం బీజేపీ నాయకులు పరిశీలించారు. అనంతరం కొనుగోళ్లను వేగవంతం చేయాలని కోరుతూ తాసీల్దార్ సురగి సైదులు, ఏఓ జావిద్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ గత నాలుగు రోజులుగా ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా జరగడం లేదని, అకాల వర్షానికి ధాన్యం తడిసి అక్కడక్కడా మొలకలు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సంకలమద్ది సత్యనారాయణరెడ్డి, మెట్టు శ్రీనివాస్‌రెడ్డి, తాళ్ల నరేందర్ రెడ్డి, వేముల శంకర్‌రెడ్డి, అంబటి నాగేశ్వరరావు, బైరెడ్డి శ్రీనివాసరెడ్డి, శివయ్య, రైతులు వెంకట్రాంరెడ్డి, రాములు పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్‌కు వాటర్ డిస్పెన్సర్ బహూకరణ

చివ్వెంల, ఏప్రిల్ 23: జిల్లా బిల్డర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చివ్వెంల పోలీస్ స్టేషన్‌కు బుధవారం వాటర్ డిస్పెన్సర్ బహూకరించారు. ఈ సందర్భంగా చివ్వెంల ఎస్ఐ మహేశ్వర్ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల దాహార్తిని తీర్చేందుకు వాటర్ డిస్పెన్సర్ ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటువంటి సేవా కార్యక్రమాలు మరిన్ని చేపట్టాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు కాసర్ల చంద్రారెడ్డి, కొడిదల భిక్షపతి, సందీప్, లక్ష్మయ్య, నారాయణ, వెంకన్న, ప్రతాప్, లింగారెడ్డి, ఉపేందర్‌రెడ్డి, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

## లారీ దగ్ధం

మునగాల, ఏప్రిల్ 23: ప్రమాదవశాత్తు లారీ దగ్ధమైన ఘటన మండల కేంద్రం మునగాల శివారులోని నాగార్జునసాగర్ హెడ్ రెగ్యులేటర్ సమీపంలో 65వ నంబర్ జాతీయ రహదారిపై మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రానైట్ ఓవర్‌లోడుతో వెళ్తున్న లారీ ఇంజిన్‌లో ఒక్కసారిగా మంటలు వచ్చి పూర్తిగా దగ్ధమైంది. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వారు వచ్చి మంటలను ఆర్పివేశారు. కాగా, ఈ విషయమై తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

## తాటిచెట్టు మీద పడి వ్యక్తి మృతి

గరిడేపల్లి, ఏప్రిల్ 23: తాటిచెట్టు మీద పడి వ్యక్తి మృతిచెందిన ఘటన మండల పరిధిలోని కల్మల్‌చెర్వు గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని శీత్లాతండాకు చెందిన గుగులోతు శ్రీను (52) కల్మల్‌చెర్వు గ్రామానికి చెందిన ఓ రైతు పొలంలో తాటిచెట్టును తొలగించేందుకు వెళ్లాడు. అయితే, తాటిచెట్టును తొలగిస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు శ్రీను మీద పడడంతో అక్కడికక్కడే మృతిచెందాడు.

## భూ భారతి చట్టంపై 25న అవగాహన సదస్సు

మునగాల, ఏప్రిల్ 23: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలలో ఈ నెల 25న భూ భారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తాసీల్దార్ ఆంజనేయులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సదస్సుకు కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి, కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ హాజరవుతున్నట్లు తెలిపారు. భూ భారతి చట్టంపై రైతులకు అవగాహన కల్పించనున్నారని, మండలంలోని రైతులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

## 'వేసవి సెలవులను విద్యార్థులు వినియోగించుకోవాలి'

పాలకవీడు, ఏప్రిల్ 23: వేసవి సెలవులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ కాటయ్య సూచించారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 24వ తేదీ నుంచి జూన్ 11 వరకు మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు వేసవి సెలవులు ప్రకటించినట్లు చెప్పారు. విద్యార్థులు సెలవులను వృథా చేసుకోకుండా వివిధ నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు.

## 'భూ భారతి'తో రైతులకు ప్రయోజనం

● మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



సదస్సులో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

నూతనకల్, ఏప్రిల్ 23: భూ భారతి చట్టంతో రైతుల భూ సమస్యలు త్వరితగతిన పరిష్కారమవుతాయని రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. భూ భారతి చట్టంపై నూతనకల్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. భూ సమస్యలపై దరఖాస్తు చేసుకున్న రైతులను రెవెన్యూ అధికారులు ఇబ్బంది పెడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ మాట్లాడుతూ భూ భారతిపై ప్రజలు అవగాహన పెంచుకొని సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి, తాసీల్దార్ శ్రీనువాస్‌రావు, ఎంపీడీఓ సునీత, పీఏసీఎస్ చైర్మన్ నాగం జయసుధసుధాకర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం

● కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

మఠంపల్లి, ఏప్రిల్ 23: రైతుల భూ వివాదాలు, పలు సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం ధరణి స్థానంలో భూ భారతి చట్టం తీసుకొచ్చిందని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. భూ భారతి చట్టంపై మండల కేంద్రంలోని వీఆర్ఎల్ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో కలెక్టర్ మాట్లాడారు. జూన్ 2 నుంచి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి ప్రజల సమక్షంలో విచారణ జరిపి నిజమైన పట్టాదారుడిని భూ రికార్డుల్లో చేర్చే విధంగా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. కాగా, మండలానికి చెందిన పలువురు రైతులు భూ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ సందర్భంగా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. భూ భారతి చట్టం ద్వారా త్వరలోనే అన్ని సమస్యలు పరిష్కారమవుతాయని కలెక్టర్ వారికి తెలిపారు. తాసీల్దార్ మంగా రాథోడ్ అధ్యక్షతన జరిగిన సదస్సులో అదనపు కలెక్టర్ రాంబాబు, ఆర్డీఓ శ్రీనివాసులు, ఏడీఏ రవినాయక్, ఎంపీడీఓ జగదీశ్, మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ రామచంద్రయ్య, వైస్ చైర్మన్ బాబు నాయక్, మాజీ జడ్పీటీసీ జగన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి : ఏపీఓ



ఉపాధి హామీ పనులను ప్రారంభించి కూలీలతో మాట్లాడుతున్న ఏపీఓ సురేశ్

గరిడేపల్లి, ఏప్రిల్ 23: ప్రజలు ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని ఏపీఓ సురేశ్ అన్నారు. మండలంలోని ఎల్బీనగర్ గ్రామ పంచాయతీలో ఉపాధి హామీ పనులను బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ వనజ, పంచాయతీ కార్యదర్శి శివ, ఫీల్డ్ అసిస్టెంట్ నాగమణి పాల్గొన్నారు.

## ఇంటర్‌లో 'శ్రీ లక్ష్మీవెంకటసాయి' విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థులతో కరస్పాండెంట్ బాలాగౌడ్

సూర్యాపేట టౌన్, ఏప్రిల్ 23: ఇంటర్ పరీక్ష ఫలితాల్లో సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీ లక్ష్మీవెంకటసాయి ఒకేషనల్ జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబర్చినట్లు కళాశాల కరస్పాండెంట్ కారింగుల బాలాగౌడ్ తెలిపారు. రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను బుధవారం కళాశాల ఆవరణలో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీహెచ్‌డబ్ల్యూ(ఎఫ్) మొదటి సంవత్సరం విద్యార్థిని గుంజ హాసిని 500 మార్కులకు గానూ 494 మార్కులు సాధించినట్లు తెలిపారు. అదేవిధంగా కంప్యూటర్ సైన్స్‌లో నక్కల కీర్తన 482, డైరీ గ్రూపులో ముండ్ల మౌనిక 475, ఎస్.గోపి 473, ఫిజియోథెరపీలో ఎం.అస్మిత 466, బత్తుల శిరీష 475, ఈటీ గ్రూపులో ఎ.అభిలాష్ 464, శ్రీవల్లి 467, కె.కమల్ 460 మార్కులు సాధించినట్లు వివరించారు. ద్వితీయ సంవత్సరం ఎంపీహెచ్‌డబ్ల్యూ(ఎఫ్)లో కె.వంశవర్ధిని 1000 మార్కులకు 989, ఎంఎల్‌టీ గ్రూపులో కారింగుల సౌజన్య 981, ఫిజియోథెరపీలో వి.గణేశ్ 978, గంపల అక్షిత 978, అనంతుల సింధుజ 977, డి.జశ్వంత్ 968, డి.శ్రీలక్ష్మీభవాని 967, జి.భార్గవి 957, కె.పవిత్ర 946, కె.ప్రమోద్ 946, డి.హేమంత్ 939 మార్కులు సాధించినట్లు చెప్పారు. కార్యక్రమంలో కళాశాల చైర్‌పర్సన్ కారింగుల విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ స్వాతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

## 'పోషకాహారం క్రమం తప్పకుండా తీసుకోవాలి'



చిన్నారులకు అన్నప్రాసన నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

మేళ్లచెర్వు, ఏప్రిల్ 23: గర్భిణులు క్రమం తప్పకుండా పోషకాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటరమణ సూచించారు. మేళ్లచెర్వులోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం నిర్వహించిన పోషణ పక్షోత్సవ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ప్రియాంక, శ్రీలత, రత్నకుమారి, వెంకటనరసమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు వీల్ చైర్లు అందజేత



దివ్యాంగులకు వీల్ చైర్లు అందజేస్తున్న సూపర్‌వైజర్ మంగమ్మ

తిరుమలగిరి, ఏప్రిల్ 23: మండలంలోని తాటిపాముల గ్రామానికి చెందిన నలుగురు దివ్యాంగులకు కలెక్టర్ ఆదేశాల మేరకు అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కందుకూరి మంగమ్మ బుధవారం వీల్‌చైర్లు అందజేశారు. నక్క లింగయ్యయాదవ్, వల్లపు సుభద్ర, బండెల అరవింద్, కోర్న వెంకన్న అనే నలుగురు దివ్యాంగులకు వీల్ చైర్లు అందించాలని అదే గ్రామానికి చెందిన కోలా రమేశ్‌గౌడ్ ఇటీవల జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. కలెక్టర్ స్పందించి సీడీపీఓకు ఆదేశాలు జారీ చేయడంతో వీల్ చైర్లు అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది పుష్పలత, సునీత, భూషణమ్మ తదితరులు పాల్గొన్నారు.

## 'ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య'



తుంగతుర్తిలో బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

తుంగతుర్తి, ఏప్రిల్ 23: ప్రభుత్వ పాఠశాలల్లో పైసా ఖర్చు లేకుండా నాణ్యమైన విద్య అందుతుందని మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కవిత అన్నారు. మండల కేంద్రంలోని పలు వార్డుల్లో బుధవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలకు విద్యాపరంగా, రక్షణ పరంగా ప్రభుత్వ పాఠశాలలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి. కృష్ణయ్య, ఎన్.విఘ్నేశ్వరి, సీహెచ్.రుక్మిణి, ఎం.సురేశ్, పి.చంద్రకళ, సీహెచ్.పుష్పలత, డి. రాజేశ్వరి, పీఈటీ అంబేద్కర్ తదితరులు పాల్గొన్నారు.